సాక్షి
తిరుపతి
సోమవారం ı 30 ı సెప్టెంబర్ ı 2024



అయోమయం

జీఎన్ఎం కోర్సు పూర్తి చేసుకున్న వారు మాతృ శాఖకు వెళ్లాలని సర్కారు చెప్పడంతో వారు అయోమయంలో పడ్డారు. - 8లో



అదివో.. అల్లదివో..

శిల్పారామంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కళాకారుల కూచిపూడి నృత్యంతో ఆకట్టుకుంది. - 8లో



ఉత్సాహంగా 5కె వాక్‌థాన్

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జాతీయ సంస్కృత వర్సిటీలో నిర్వహించిన 5కె వాక్‌థాన్‌లో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 71,133 మంది స్వామివారిని దర్శించుకోగా 34,502 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.28 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

ఇంటి వద్దే పింఛన్

తిరుపతి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్లను సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకే వచ్చి లబ్ధిదారులకు అందజేస్తారని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరూ సచివాలయం వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అక్టోబర్ 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. పింఛన్‌దారులు అందుబాటులో ఉండి తీసుకోవాలని సూచించారు. అక్టోబర్ నెలకు జిల్లాలో 2,66,342 మందికి రూ.112.71కోట్ల పింఛన్ నగదు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

బధిరుల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తిరుపతి కల్చరల్: బధిరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రాస్ భవన్‌లో అంతర్జాతీయ బధిరుల సంజ్ఞల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంజ్ఞల దినోత్సవ నిర్వహించడం జరిగిందన్నారు. బధిరుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్ల పంపిణీ, వినికిడి యంత్రాలు, చదువుకునే విద్యార్థులకు టచ్ ఫోను, ల్యాప్‌టాప్, హియర్ అండ్ స్పీచ్ థెరపీ, స్వయం ఉపాధి కోసం రుణాలు వంటి వాటిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ పర్యవేక్షకులు బి.వినోద్, మనోజ్‌కుమార్, జిల్లా బధిరుల సంఘం ప్రతినిధులు కల్యాణ్ చక్రవర్తి, రెడ్డెప్పరెడ్డి, సుబ్బారాయుడు, మాధవ్, సి.యువరాజ్, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: ఎక్సైజ్ శాఖలోని జోన్–3 పరిధిలోని పలువురు ఎక్సైజ్ సీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లాలోని గూడూరుకు షేక్ కరీం బేగం, వాకాడుకు సత్యనారాయణ ప్రసాద్, సూళ్లూరుపేటకు సురేంద్రబాబు, నాయుడుపేటకు అరుణ కుమారి, వెంకటగిరికి సూర్యనారాయణను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. జోన్–4 పరిధిలోని సీఐల బదిలీపై ఇంకా కసరత్తు కొనసాగుతోంది.

దైవ సంకల్పం మాధవ శిల్పం



''ఉలి దెబ్బలకు శిల శిల్పమైనట్లు.. కొయ్యకు ఉలితో రూపమిచ్చి జీవం పోస్తున్న వారి కళ అజరామరం.. దశాబ్దాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని వందల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. పెద్దవృక్షాల నుంచి చెక్కలను చెక్కితే నిజమైన దేవుడు ఇలానే ఉంటాడా అనేలా జీవం పోస్తారు. దేవుడి ప్రతిమలు, ప్రకృతి ఉట్టిపడే కొయ్యబొమ్మల తయారీలో వారి నైపుణ్యం జాతీయ స్థాయిలో బయట ప్రపంచానికి పరిచయమైంది. వీరు తయారు చేసిన బొమ్మలకు ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడడంతో చేతి నిండా పని దొరుకుతోంది. ఆధునిక కాలానికి అనుగుణంగా కళాకారులకు కాసింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉంది.



కొయ్యబొమ్మలు చెక్కుతున్న కళాకారులు

కళలకు కాణాచి.. మాధవమాల

- వృత్తేదైవంగా కొయ్యబొమ్మల తయారీ
- ఉలి మెలి తిప్పి దేవుడు రూపానికి ప్రాణం
- దేశవ్యాప్తంగా ఎగ్జిబిషన్లలో ప్రత్యేక ఆకర్షణగా కొయ్యబొమ్మలు
- యంత్రాలు అందిస్తే మరింత రాణిస్తామంటున్న కళాకారులు

రేణిగుంట: నిద్రలో కనేది కల.. నిద్ర లేపేది కళ.. కొయ్యబొమ్మల కళాకారులను కళ నిద్ర లేపుతూనే ఉంటుంది. అందుకు వారు తయారు చేసే బొమ్మలే తార్కాణం.. చెక్కకు జీవం పోయడంలో వారి అపార మేధోసంపత్తికి కొలమానం లేదు. ఏర్పేడు మండలంలోని కుగ్రామమైన మాధవమాల కొయ్యబొమ్మలకు పుట్టినిల్లుగా విరాజిల్లుతోంది. అనాదిగా ఇక్కడ కళాకారులు తయారు చేసిన కొయ్యబొమ్మలు జాతీయస్థాయి ప్రదర్శనల్లో పెట్టడం, ఈ బొమ్మలు ప్రపంచ ప్రాచుర్యం పొందాయంటే గర్వకారణం. కొయ్యబొమ్మల తయారీనే వృత్తిగా చేసుకుని ఇక్కడ వందలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. బాలాజీ ఉడ్ కార్వింగ్ ఆర్టిషన్స్ మ్యూచువలీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరిట 2013లో కొయ్యబొమ్మల తయారీ కళాకారులతో సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. సంస్థ అధ్యక్షుడిగా లోకనాథాచారి, కార్యదర్శిగా రాజాచారి, సీఈఓగా తిరుపతికి చెందిన గోవిందయ్య, చీఫ్ ప్రమోటర్‌గా కృష్ణమూర్తి కొనసాగుతున్నారు. మాధవమాల, గోపాలపురం, పాతవీరాపురం, శ్రీకాళహస్తి, బీఎన్‌కండ్రిగ, తొట్టంబేడు, రేణిగుంట తదితర మండలాలకు చెందిన సుమారు 360 మందికి పైగా కొయ్యబొమ్మల కళాకారులను గుర్తించారు. వారితో సమావేశాలు జరిపి సంస్థలో పనిచేసేందుకు ఒప్పించారు. డీఆర్‌డీఏ, నాబార్డు సహకారంతో సంస్థలోని కొయ్యబొమ్మల కళాకారులను గ్రూపులుగా తయారు చేశారు. గ్రామంలో ఓ భవనం నిర్మించి అక్కడే కార్మికులు పని చేసుకునే సౌలభ్యం కల్పించారు.

కొయ్యబొమ్మల తయారీకి ముడిసరుకుగా..

కొయ్యబొమ్మల తయారీకి ముడిసరుకుగా టేకు, వేప, చీమచింత, తుమ్మ, దిరసన, మామిడి కొయ్యలను వాడుతున్నారు. శ్రీకాళహస్తి, తిరుపతి టింబర్ డిపోల నుంచి ముడిసరుకును మార్కెట్ ధర ప్రకారం విక్రయిస్తారు. వీటిపై ఎలాంటి రాయితీ లేదు. ప్రధాన ముడిసరుకు అయిన కొయ్యలపై రాయితీ ఇచ్చి నాణ్యమైన కొయ్యను డీఆర్‌డీఏ సరఫరా చేస్తే వీరికి ప్రయోజనకరంగా ఉంటుంది.

టెక్నాలజీ మేళవిస్తే..!

వీరి హస్తకళా నైపుణ్యంతో ఎలాంటి టెక్నాలజీని వాడకుండా సంప్రదాయబద్ధంగా చెక్కుతుంటేనే ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తోంది. అయితే వీరి కళకు టెక్నాలజీని మేళవించి అందుకు సరిపడా యంత్ర పరికరాలు, వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తే మరింత మెరుగ్గా కొయ్యబొమ్మ కళకు అందం తెస్తామని కళాకారులు చెబుతున్నారు. దీనికితోడు తమకు విరివిగా రుణాలిచ్చి ముడి సరుకు కొనుగోలు భారం పడకుండా సాయపడాలని కోరుతున్నారు.

కలంకారీతో మహిళలకు ఉపాధి..

గ్రామానికి చెందిన కొందరు మహిళలు కళంకారీ శిక్షణ తీసుకుని సంస్థ భవన ప్రాంగణంలో కళంకారీ వస్త్రాలను రూపొందిస్తున్నారు. మహిళలు సైతం గ్రూపులుగా ఏర్పడి వస్త్రాలను కళంకారీ రంగులు అద్దుతున్నారు. మున్ముందు గ్రామంలో కళంకారీని కూడా మరింత విస్తృత పరిచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

మాధవుని ప్రతిమల తయారీకే ప్రాధాన్యం

ఇక్కడి కళాకారులు ఒక అడుగు నుంచి 15 అడుగుల వరకు వివిధ రకాల దేవతల కొయ్యబొమ్మలను తయారు చేస్తారు. అవి దైవరూపాన్ని సాక్షాత్కరించి జీవం ఉట్టిపడేలా చెక్కడం వీరి ప్రత్యేకత. దీంతో పాటు ఆలయాల ధ్వజస్తంభాలు, రథాలు, ప్రధాన ద్వారాలు, తయారు చేసిన బొమ్మలను సంస్థ ద్వారా జైపూర్, ముంబై, కోల్‌కతా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో జరిగే ఎగ్జిబిషన్లకు పంపుతారు. అక్కడ నుంచి చైనా, జపాన్, లండన్, అమెరికా తదితర దేశాలకు బొమ్మలను ఎగుమతులు చేస్తారు. అమ్మకాలు జరిగిన బొమ్మలకు సంబంధించిన డబ్బును ఆన్‌లైన్ ద్వారా సంస్థ ఖాతాకు పంపుతారు. ఏడాదిలో సగటున టర్నోవర్ రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ఈ పరిశ్రమ ద్వారా కార్మికులు ఆర్జిస్తున్నారు.



జాతీయస్థాయి ప్రదర్శనలలో మాధవమాల కొయ్యబొమ్మలు

అవార్డులు కూడా అందుకున్నా..



మా పూర్వీకుల నుంచి ఈ కళనే నమ్ముకుని జీవిస్తున్నాం. వృత్తే దైవంగా ఎనిమిదేళ్ల పాటు తోటి కార్మికుల శ్రేయస్సుకై అధికారుల సహకారంతో ఎన్నో రాయితీ రుణాలు వచ్చేలా కృషి చేశాను. మూడేళ్ల కిందట వైఎస్సార్ జీవన సాఫల్య అవార్డును కూడా నేను అందుకున్నా. కొయ్యబొమ్మల కళాకారులకు నైపుణ్యాలపై శిక్షణ ఇప్పించాం. తద్వారా నాణ్యతతో కూడిన బొమ్మలను తయారు చేశారు. మా కళను ప్రోత్సహిస్తున్న నాబార్డు, డీఆర్‌డీఏ అధికారులకు రుణపడి ఉంటాం. – రాజాచారి, మాధవమాల, సంస్థ కార్యదర్శి, ఏర్పేడు మండలం

యంత్ర పరికరాలిస్తే బాగుంటుంది



మారుతున్న కాలానుగుణంగా విభిన్నశైలిలో ఆకట్టుకునే కొయ్యబొమ్మల తయారీకి టెక్నాలజీకి అనుగుణమైన ఆధునిక యంత్ర పరికరాలను మాకు అందిస్తే కళకు మరింత ప్రాచుర్యం తీసుకొస్తాం. అలాగే మార్కెటింగ్ సదుపాయాలను మరింత విస్తృత పరచాలి. కార్మికులకు ప్రభుత్వం నుంచి మరిన్ని సబ్సిడీ రుణాలు అందించాలి. – వెంకటముని ఆచారి, కొయ్యబొమ్మల కళాకారుడు, మాధవమాల









మాధవమాలలో కళాకారులు తయారు చేసిన వివిధ రకాల కొయ్యబొమ్మలు



జీవకళ ఉట్టిపడేలా తయారు చేసిన బొమ్మ

ప్రతి నెలా ఏడిపింఛన్..!

- కనికరం లేకుండా పండుటాకుల పొట్ట కొడుతున్న పాలకులు
- ఈ మూడు నెలల్లోనే 2,820 పింఛన్లను తొలగించిన వైనం
- కన్నీళ్లు పెడుతున్న వయోవృద్ధులు
- పింఛన్‌దారులకూ తప్పని కూటమి రాజకీయ గ్రహణం
- ప్రతి నెలా పింఛన్లను తొలగిస్తున్న వైనం

తిరుపతి అర్బన్: ఎవరైనా మంచి పనులు చేస్తే మంచివాడు అంటారు. అలాగే ప్రభుత్వంలోని పాలకులు అయినా సరే ఎన్నుకున్న ప్రజలకు మంచి చేస్తే మంచి ప్రభుత్వమని భావిస్తారు. అయితే చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో వందరోజులు పూర్తయినా ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఆరంభంలో మాత్రం పింఛన్లు ఇస్తున్నట్లు బిల్డప్ ఇచ్చారు. తరువాత నెల నుంచి వరుసగా పింఛన్లు తొలగించేస్తున్నారు. అవసాన దశలో ఉన్న తమకు వచ్చే ఆ పింఛన్ తీసేస్తున్న వీరిది మంచి ప్రభుత్వం ఎలా అవుతుంది ? అని పలువురు పండుటాకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే సీఎం మాత్రం ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ వెళ్లి పది రోజుల పాటు డబ్బా కొట్టి ఒక స్టిక్కర్‌ను ప్రతి ఇంటికీ అంటించమని ఆదేశాలు ఇచ్చేశారు. అయితే ప్రజలు మాత్రం మండిపడుతున్నారు. ఒక్క హామీని అమలు చేయకుండా ఇది మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు.



పింఛన్ల పంపిణీపై అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తొలగించిన పింఛన్ల వివరాలు ఇలా..

నెల	పింఛన్ల సంఖ్య	తేడా
జూలై	2,69,162 మందికి ఇచ్చారు	
ఆగస్టు	2,67,772	1390(తొలగించారు)
సెప్టెంబర్	2,67,089	683(తొలగించారు)
అక్టోబర్‌లో	2,66,342	747(తొలగించారు)
మొత్తంగా మూడు నెలల్లో 2,820 పింఛన్ల తొలగింపు		

ఈ మూడు నెలల్లో 2820 పింఛన్ల తొలగింపు

టీడీపీ నేతలు ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేస్తున్నారు. అయితే గత మూడు నెలల కాలంలోనే జిల్లాలో 2820 మంది పింఛన్లు తొలగించారు. మరి ఇన్ని పింఛన్లు తొలగించే ప్రభుత్వం మంచిది ఎలా అవుతుందని సగటు సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రతి నెలా పింఛన్ల కోత జరుగుతూనే ఉంది.

ఎన్నికలప్పుడేమో 45 ఏళ్లకే పింఛన్..

మరోవైపు చంద్రబాబునాయుడు సార్వత్రిక ఎన్నికల సమయంలో 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ దిశగా కూటమి సర్కారు ఒక్క అడుగు కూడా ముందుకు వేయడం లేదు. ఉన్న పింఛన్లనే తొలగిస్తుంటే ఇక కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త పింఛన్ల ఊసేలేదు..

సాధారణంగా అర్హులైన వారికి సామాజిక భద్రత పింఛన్లకు ఏడాదిలో రెండుసార్లు ఎంపిక చేయడం దశాబ్దాలుగా వస్తోంది. తొలి దశగా కొత్త పింఛన్లకు అర్హులైన వారు జనవరి 1వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. వాటిని కసరత్తు చేసి జూన్‌లో కొత్త పింఛన్లు ఇస్తారు. అదేవిధంగా రెండో దశలో జూలై 1 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకుంటే డిసెంబర్ నుంచి ఇవ్వడం పరిపాటి. అయితే ఈ ఏడాదిలో(జనవరి 1 నుంచి మే 31 వరకు) 5,500 మంది కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అవి జూన్‌లో ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు తొలి దశకు సంబంధించిన కొత్త పింఛన్ల ఊసే లేదు. రెండో దశకు సంబంధించి జూలై 1వ తేదీ నుంచి నవంబర్ 30 వరకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. వాటి మాటేంటో అర్థం కావడం లేదు.

డిగ్రీ అడ్మిషన్లు అంతంత మాత్రమే

- టీటీడీ విద్యాసంస్థల్లో ముగిసిన మూడో విడత డిగ్రీ అడ్మిషన్లు
- హాస్టల్ సీట్ల కొరతతో తగ్గిన ప్రవేశాలు
- త్వరలో స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలల్లో ఓఏఎండీసీ ద్వారా జరిగిన మూడు విడతల అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలల్లో ప్రవేశాలు అంతంతమాత్రంగానే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పూర్తిస్థాయిలో అడ్మిషన్లు జరగకపోవడానికి ప్రధాన కారణం టీటీడీ యాజమాన్య కళాశాలల్లో సీట్లకు తగ్గట్టు హాస్టల్ వసతి లేకపోవడమే. ఇప్పటికే ఎస్వీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలల్లోనూ, ఎస్పీడబ్ల్యు కళాశాలలో గత ఏడాది అదనంగా నూతన హాస్టల్ భవనాలను నిర్మించారు. అయినప్పటికీ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సీట్లకు తగ్గట్టు హాస్టల్ వసతి కల్పించలేదు. దీంతో విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు పొంది టీసీ తీసుకుని వెళ్తున్నారు.



పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల

త్వరలో స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్

టీటీడీ యాజమాన్య కళాశాలల్లో మిగిలి ఉన్న సుమారు 1,143 సీట్ల భర్తీ కోసం త్వరలో స్పాట్ అడ్మిషన్ల పేరుతో మరో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇందులో సీట్లు పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి, ప్రభుత్వం నుంచి విడుదలయ్యే ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యాలు వర్తించవు. ఎలాగైనా పూర్తి స్థాయిలో సీట్లను భర్తీ చేసేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది.

కళాశాల	విభాగాలు	మొత్తం సీట్లు	పొందిన అడ్మిషన్ల సంఖ్య	మిగిలు సీట్లు
ఎస్వీ ఆర్ట్స్ కళాశాల	20	1417	1076	341
ఎస్పీడబ్ల్యూ	21	1550	1114	436
ఎస్‌జీఎస్	19	1068	702	366

క్లుప్తంగా

ఉత్సాహంగా 5కే వాక్‌థాన్

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా తిరుపతిలో ఓ ప్రవేటు హాస్పిటల్ వారు నిర్వహించిన 5కే వాకథాన్‌లో 300 మంది వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు సమాజ సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ సేతురామ్, కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎ.చందూలాల్ పాల్గొన్నారు.

కళ్లెదుటే కొడుకు చనిపోవడంతో..



గూడూరురూరల్ : ఆదివారం సెలవు దినం కావడంతో సాయంత్రం వేళ ఓ తండ్రి తన కొడుకులతో కలిసి మైదానానికి వెళ్లాడు. అయితే తండ్రి వాకింగ్ చేస్తుండగా.. పిల్లలు ఆడుకుంటున్నారు.. ఇదే సమయంలో డ్రైవింగ్ నేర్చుకోవడానికి వచ్చిన వ్యక్తి కారు అదుపు తప్పడంతో ఆడుకుంటున్న పిల్లాడిపైకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటన గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఎస్కే ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోపాల్ కథనం.. ఎగువవీరారెడ్డి పల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవి ఆదివారం సాయంత్రం తన ఇద్దరు కుమారులతో కలిసి క్రీడా మైదానానికి వెళ్లాడు. అక్కడ పిల్లలంతా ఆడుకుంటుండగా తాను వాకింగ్ చేస్తున్నాడు. అదే సమయంలో వంశీ అనే మెకానిక్ కారు డ్రైవింగ్ నేర్చుకుంటుండగా అదుపు తప్పి అక్కడే ఉన్న ఓ చెట్టును ఢీకొని పక్కనే ఉన్న రవి రెండో కుమారుడు లీలావిన్షిత్(11)పైకి దూసుకెళ్లింది. దీంతో చిన్నారి తల టైర్ కింద పడి ఛిద్రమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడి తల్లి మాధవి ఆస్పత్రి వద్ద విలపించిన తీరు అక్కడ ఉన్నవారి కంట కన్నీరు పెట్టించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

తిరుపతి కల్చరల్: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయడానికి ప్రయత్నం చేస్తోందని, దీన్ని ప్రతిఘటించేందుకు సన్నద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం గంధమనేని శివయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, హేమలత పాల్గొని ప్రసంగించారు. అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు తిరపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు.

సర్కారువారి కిక్కు!

కూటమి ప్రభుత్వం చెప్పినట్టుగానే ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దయ్యాయి. ప్రైవేట్ ఆధ్వర్యంలో నడిచే దుకాణాలు ఏర్పాటుకానున్నాయి. ఈ మేరకు వారంలో కొత్త మద్యం పాలసీ నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇప్పటికే పట్టణాల్లో సిట్టింగ్ రూముల కోసం అన్వేషణ ప్రారంభమైంది. పేరుకు ప్రైవేటు మద్యం దుకాణాలే తప్ప.. అమ్మకాలు, సిట్టింగ్ రూమ్‌లు, బెల్టు దుకాణాలు అన్నీ కూటమి నేతల కనుసన్నల్లోనే సాగనున్నాయి. అంతేగాక గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు పెట్టి మద్యం విక్రయాలు పెంచుకోవాలని ఇప్పటి నుంచే నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు సమాచారం.

- అన్నీ సిద్ధం.. పాలసీ ప్రకటనే తరువాయి
- ఈ వారంలో కొత్త మద్యం పాలసీ నోటిఫికేషన్
- తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 270 దుకాణాలు..?
- పట్టణాల్లో సిట్టింగ్ రూముల కోసం అన్వేషణ
- ఇక గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు
- ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసే సిబ్బందికి రిక్తహస్తం



చిత్తూరు అర్బన్ : నూతన ప్రైవేటు మద్యం దుకాణాలకు సంబంధించిన పాలసీ నోటిఫికేషన్ ఈ వారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయి. ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించిన తరువాత చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. చిత్తూరు, తిరుపతి రెండు జిల్లాలకు కలిపి ఈ సారి 270 వరకు మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయి. ప్రాథమికంగా ఈ రెండు జిల్లాల్లో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ ప్రాతిపదికన మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ఈ నెల 15వ తేదీలోపు ప్రైవేటు దుకాణాల ఏర్పాటు, మద్యం అమ్మకాలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న జిల్లాలోని వెయ్యి మంది నిరుద్యోగులు రోడ్డున పడటం ఖాయంగా కనిపిస్తోంది. ఇక కల్లుగీత కార్మికులకు దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మేనిఫెస్టోలో చెప్పిన కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో దాన్ని అమలుకు మతలబు పెట్టినట్లు తెలుస్తోంది. కల్లుగీత కార్మికులకు సర్కిళ్ల వారీగా ఉన్న దుకాణాల్లో రిజర్వేషన్ ఇవ్వకూడదని, జిల్లా యూనిట్‌గా తీసుకుని జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దుకాణాలు ఇస్తే భవిష్యత్తులో ఓటు బ్యాంకు నిలబడుతుందనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

రూముల కోసం అన్వేషణ

మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇప్పటికే నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను అద్దెకు తీసుకోవడానికి భవన యజమానులకు పలువురు అడ్వాన్సులు కూడా ఇచ్చేసారు. దుకాణాల పక్కనే మద్యం తాగడానికి సిట్టింగ్ గదులను చూసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద ఈ పరిస్థితిలేదు. అలాగే గ్రామాల్లో కిరాణా దుకాణాల నుంచి టైలర్ దుకాణం వరకు పలువురు టీడీపీ నేతలకు ఉపాధి కల్పిస్తూ బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా ఏర్పాటు కానున్నాయి. ఇళ్ల వద్దకే మద్యాన్ని 24 గంటల పాటు అందుబాటులో ఉంచడమే బెల్టు దుకాణాల లక్ష్యంగా కూటమి నేతలు ముందుకు సాగనున్నారు.

ఎక్సైజ్ శాఖలో సర్వం సిద్ధం

కొత్త మద్యం పాలసీ నోటిఫికేషన్ ఇవ్వడానికి ముందే కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెబ్‌ను రద్దుచేసింది. ఆ స్థానంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖను పునర్వ్యవస్థీకరించింది. ఇప్పటికే చిత్తూరు కేంద్రంగా ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ హోదాలో అధికారిని నియమించింది. ఆయన చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పరిపాలన వ్యవహారాలు చూడాల్సి ఉంది. ఈ కార్యాలయానికి 17 మంది సిబ్బందిని కేటాయించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కోసం చిత్తూరు కేంద్రంగా అసిస్టెంట్ కమిషనర్ పోస్టును క్రియేట్ చేశారు. ఆయన కూడా రెండు జిల్లాల బాధ్యతను చూసుకుంటారు. డిస్టలరీల పర్యవేక్షణకు తిరుపతి కేంద్రంగా అసిస్టెంట్ కమిషనర్‌ను నియమించారు. ఆ పోస్టు పరిధిని నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, కర్నూలు, కడప, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు విస్తరించారు. అలాగే చిత్తూరు, గూడూరు, తిరుపతి కేంద్రాలుగా టాస్క్‌ఫోర్స్ కార్యాలయాలు.. ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్ ఉంటారు. తడ సమీపంలోని బీవీ.పాలెం, చిత్తూరులోని ఎన్ఆర్.పేట, పలమనేరులోని వి.కోటల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు సాదర వీడ్కోలు



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వీడ్కోలు పలుకుతున్న న్యాయమూర్తులు, అధికారులు

రేణిగుంట: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణమైన ఆయనకు విమానాశ్రయంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ పి.కృష్ణమోహన్, రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ జస్టిస్ వై.లక్ష్మణరావు, రాష్ట్ర హైకోర్టు ప్రొటోకాల్ రిజిస్ట్రార్ జస్టిస్ రాఘవ స్వామి, జస్టిస్ రామకృష్ణ, చిత్తూరు జిల్లా ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఈ.భీమారావు, చీఫ్ ప్రొటోకాల్ ఆఫీసర్ గురునాథ్, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ప్రొటోకాల్ మెజిస్ట్రేట్ కోటేశ్వరరావు, ప్రొటోకాల్ సూపరింటెండెంట్ ధనుంజయ నాయుడు తదితరులు సాదర వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

గ్లోబల్ లెవెల్ వ్యాపార కేంద్రంగా తిరుపతి



వ్యాపారవేత్తల సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న బీఎన్ఐ ఈడీ రమేష్, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ఇందుకోసం ప్రతి వ్యాపారవేత్త సహకరించాలని బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీటీ రమేష్ పిలుపునిచ్చారు. బీఎన్ఐ ఆధ్వర్యంలో ఆదివారం మంగళం రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో అతిపెద్ద, ప్రముఖ వ్యాపారవేత్తల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తిరుపతిని గ్లోబల్ లెవెల్ బిజినెస్ సెంటర్‌గా మార్చడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఒకే వేదికపై ఇన్ని రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు కలవడం గొప్ప అవకాశమని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి సౌత్ ఇండియాలోని బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, వైజాగ్ నగరాల నుంచి సుమారు 750 మంది విచ్చేసి వారి వారి వ్యాపారాల అభివృద్ధి గురించి వివరించారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు విక్రయించాలన్నారు. భారత దేశంలో తయా రు చేసే వస్తువులకు ప్రకటన ఖర్చులు తగ్గించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎన్ఐ కన్సల్టెన్సీ చైర్మన్ పార్థ, కోచైర్మన్ సాయికిరణ్, ఈడీ సంతోష్, నిర్వాహకులు వంశీకృష్ణ, స్థానిక వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

అదివో అల్లదివో!



కూచిపూడి నాట్యంతో అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాలను ప్రేక్షకులను రంజింపజేశాయి. తిరుపతికి చెందిన కొండాసాయి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా మహాగణపతి, మూషిక వాహన, శంభో శివశంభో, అదివో అల్లదివో, కొండలలో నెలకొన్న, శంభో మహదేవ, పలుకే బంగారమాయన, సౌభాగ్య లక్ష్మీ, గంధము పూయగా వంటి పాటలకు కళాకారులు తేజోమయి, షణ్ముఖప్రియ, మిథున జయశ్రీ, వర్షిక, త్రిలోచన, జస్మిత, బిందు మాధవి, నితిక్ష, జయశ్రీ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

రత్నప్రసాద్ సేవలు మరువలేనివి

– భాస్కరయ్యకు జిల్లా ఆత్మ పీడీ బాధ్యతల అప్పగింత



రత్నప్రసాద్‌ను సన్మానిస్తున్న జిల్లా వనరుల కేంద్రం అధికారులు, ఉద్యోగుల

తిరుపతి అర్బన్: తిరుపతి, చిత్తూరు జిల్లాల ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నప్రసాద్ ఇచ్చిన వ్యవసాయ సూచనలు, సలహాలు మార్గదర్శకాలు అయ్యాయని జిల్లా వనరుల కేంద్రం సీనియర్ ఏడీఏ మెరుగు భాస్కరయ్య తెలిపారు. పదోన్నతిపై రత్నప్రసాద్ కర్నూలు జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఆదివారం తిరుపతిలోని జిల్లా వనరుల కేంద్రం కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మెరుగు భాస్కరయ్య మాట్లాడుతూ వ్యవసాయశాఖకు అనుబంధంగా ఉన్న జిల్లా వనరుల కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు రత్నప్రసాద్ ఇచ్చిన సూచనలు, సలహాలు రైతులకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చాయని వెల్లడించారు. ప్రధానంగా తెగుళ్ల నివారణకు, దిగుబడిని పెంచడానికి అన్నదాతలకు ఎంతో ఉపయోగపడ్డాయని వివరించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ తిరుమల వెంకన్న పాదాల చెంత పని చేయడానికి రాష్ట్రంలోని ఉద్యోగులు ఎంతో ఆసక్తి చూపుతారని చెప్పారు. ఆయన బదిలీ కావడంతో జిల్లా వనరుల కేంద్రం సీనియర్ ఏడీఏ మెరుగు భాస్కరయ్యకు జిల్లా వ్యవసాయ శిక్షణ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీదేవి, ఏఓలు సరళ, వేణుగోపాల్‌రావు, శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ బాలాజీ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
■ BA, B.Com, B.Sc, BBA, BCA, B.Lis, MA, M.Com, M.Sc, MCA, MBA, , M.Lis, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT అక్టోబర్ 3వ తేదీ చివరి తేది: 9030030125.

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Real Estate

PLOTS FOR SALE
■ నేషనల్ హైవేకి అనుకొని IISER వెనుకవైపు ఫైనల్ అప్రూవ్ ప్లాట్లు అన్ని సదుపాయాలతో తక్కువ ధరలో డైరెక్ట్ ఓనర్. 9502774175, 7416211984.

RENT
■ Scientific Warehouses with FCI Specification of 13,250 Sq.ft each 2 Warehouses total 26,500 Sq.ft is readily available for occupation for Rent at adjacent National Highway, Near Airport. PCR Warehousing Ltd., D.No.3-147, Guravarajupalli, Tirupati-Srikalahasthi Road, Renigunta- 517520, Ctr, A.P. 98490 46567, Email: porayulu@gmail.com, Web:pcrgroup.in

TOLET
■ రామకృష్ణ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్ నందు 2 BHK ప్లాట్ నెం.5-5-328C/308, 1200 చ.అ.లు గల ప్లాట్ బాడుగకు ఇవ్వబడును. కార్ పార్కింగ్ కలదు✆ 9885846182, 9959534715

WANTED
■ Wanted Villa. Wanted 4 or 5 Bed Room East/ North Facing Villa/ Individual House for Rent Purpose in Tirupati for a Business Family.✆ 90102 03671.

Services

■ CLEANING. బాత్రూం క్లీనింగ్ & వాటర్ ట్యాంక్ క్లీనింగ్ & హౌస్ కీపింగ్ సర్వీసెస్ కోసం సంప్రదించండి సెల్: 9000312779, తిరుపతి.

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, Gorlamudivedu Zakiya Kousar D/o Gorlamudivedu Noorjahan, D.No.13-7-938/A2, Vivekananda Street, Tirupati, A.P. mentions that my Mother's Old Name Noorjahan Begum Kadapa mentioned in my Passport & correct Name is Gorlamudivedu Noorjahan (New Name).

Wanted

■ తిరుచానూరు మెయిన్ రోడ్డు లాడ్జి నందు పనిచేయుటకు ఇంగ్లీషు మాట్లాడ కల్గిన రిసెప్షనిస్ట్, రూం బాయ్స్ కావలెను. సంప్ర: 9110550998.

■ తిరుపతి హోమ్ కేర్ సర్వీసెస్, శ్రీమంతుల ఇళ్లలో పనిచేయుటకు పెద్దవారిని, పేషంట్లను చూసుకోనుటకు వర్కర్స్ 24/7 కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ:15000-18000 ✆8121555038, 8121555034

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP& డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు, ఫ్రీరూం+భోజనం. Hyd. 9182280297

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18k. ఫోన్: 9640258899, 9640468899

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

అయోమయం

పేదల సంపాదనలో విద్య, వైద్యానికే ఎక్కువ భాగం ఖర్చు అవుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారికి ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందించాలని భావించింది. ఇందులో భాగంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. వైద్య, ఆరోగ్య శాఖను పటిష్టం చేసింది. ప్రతి సచివాలయం పరిధిలోనూ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తీసుకువచ్చింది. గ్రామ సచివాయాల్లో పనిచేసే ఏఎన్ఎంలకు జీఎన్ఎం (జనరల్ మెడిసిన్ అండ్ మిడ్‌వైఫరీ) రెండేళ్లు శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేసింది. ప్రస్తుతం వారు శిక్షణ పూర్తి చేసుకుని రిలీవ్ అయ్యారు. ఉద్యోగోన్నతి కల్పించకుండా యథావిధిగా మాతృ స్థానాల్లో చేరాలన్న కూటమి ప్రభుత్వ ఉత్తర్వులతో అయోమయంలో పడ్డారు.

- రెండేళ్ల క్రితం జీఎన్ఎం శిక్షణ కోసం ఏఎన్ఎంల ఎంపిక
- ఆపై శిక్షణను ఆరునెలలు పొడిగింపు
- ఇటీవల శిక్షణ పూర్తి.. పాత చోటే పోస్టింగ్
- ఆందోళనలో 198 మంది ఏఎన్ఎంలు



తిరుపతి, చిత్తూరు జిల్లా వివరాలు..

సచివాల యాల సంఖ్య	1312
పీహెచ్‌సీల సంఖ్య	104
పొడిగింపు కాలం	6 నెలలు
శిక్షణ కాలం	2సంవత్సరాలు
మొత్తం ఏఎన్ఎంలు	2,566 మంది
శిక్షణ పొందిన ఏఎన్ఎంలు	198 మంది

కాణిపాకం : చిత్తూరు, తిరుపతి జిల్లాలతోపాటు మదనపల్లిలో 1,312 వార్డు, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో అర్హత, ఆసక్తి కలిగిన 198 మంది ఏఎన్ఎంలను, జీఎన్ఎంలుగా శిక్షణ పొందేందుకు ఎంపిక చేశారు. 2021 ఏప్రిల్ ఒకటో తేదీన శిక్షణ ప్రారంభమైంది. చిత్తూరు, మదనపల్లి, తిరుపతి జిల్లా ఆస్పత్రుల్లో పనిచేస్తూ ప్రభుత్వ ఖర్చుతో రెండేళ్ల జీఎన్ఎం శిక్షణను పూర్తి చేసుకున్నారు. 2023 మార్చి 31 నాటికి శిక్షణ పూర్తయింది. అప్పటికే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జీఎస్ఎం శిక్షణ గడువును మూడు నెలలు పొడిగించారు. అది కూడా ఆగస్టు నెలతో పూర్తయింది. దీంతో 27 నెలల పాటు శిక్షణ పొందుతూ సేవలను అందించిన ఏఎస్ఎంలు తమకు పద్యోగోన్నతి కల్పిస్తారనే ఆశతో ఉన్నారు. ఈ నేపథ్యంలో జీఎస్ఎం శిక్షణ పొందిన ఏఎన్ఎం విధుల గురించి కొత్తగా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ ప్రభుత్వం విధి విధానాలను జారీ చేసింది. జీఎస్ఎం శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎన్ఎంలందరూ గతంలో పనిచేసిన గ్రామ సచివాలయాలకు వెళ్లి పూర్వపు బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. జీఎస్ఎం శిక్షణతో పాటు రాత పరీక్షలు పూర్తయి త్వరలో సర్టిఫికెట్లు కూడా రానున్నాయి. ఆపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఏఎస్ఎంలు అయోమయంలో పడ్డారు.

పీహెచ్‌సీలో పనులు

జీఎస్ఎం పూర్తి చేసుకున్న ఏఎన్ఎంలను మాతృస్థానాలకు పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొంతమంది ఏఎన్ఎంలను పీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సులుగా వాడుకుంటున్నారు. ప్రతి పీహెచ్‌సీలోనూ రెగ్యులర్, కాంట్రాక్ట్, ఎన్ఆర్‌హెచ్ఎం కింద ముగ్గురు స్టాఫ్ నర్సులు పనిచేస్తున్నారు. జీఎస్ఎం పూర్తి చేసిన ఏఎస్ఎంలను పలుచోట్ల డాక్టర్లు పీహెచ్‌సీల్లో పనులు చేయించుకుంటున్నారు. నైట్ డ్యూటీలు వేస్తామని భయపెడుతున్నారు. అక్కడ యథావిధిగా పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను కుర్చీలకు పరిమితం చేశారు. దీంతో పీహెచ్‌సీల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇక పల్లె, పట్టణం తేడా లేకుండా విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏఎస్ఎంలను పీహెచ్‌సీలకు పరిమితం చేయడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

హామీలో స్పష్టత ఏదీ

జీఎస్ఎంలుగా శిక్షణ పొందిన ఏఎస్ఎంలకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. వారు సచివాయాల్లో మాతృ స్థానాల్లోనే విధులు నిర్వహించేలా చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నాలుగు రోజుల క్రితం రిలీవ్ ఆర్డర్లు తీసుకుని సత్వరమే ఆయా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లోను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే రిపోర్టు చేసి సంబంధిత గ్రామ సచివాయాల్లో బాధ్యతలు స్వీకరించాలని పేర్కొంది. దీంతో రెండేళ్ల నుంచి అహర్నిశలు శ్రమించి శిక్షణ పొందిన ఏఎస్ఎంలు మళ్లీ గ్రామస్థాయిలో అదే సేవలను అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందులో భాగంగా ఇప్పటికే జీఎస్ఎం శిక్షణ పొందిన ఏఎస్ఎంలు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హడావుడిగా గ్రామ సచివాలయాల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. దానికనుగుణంగా పోస్టింగ్ ఇచ్చేందుకు వైద్యాధికారులు మార్గం సుగమం చేశారు.

ఆందోళనలో వైద్య సిబ్బంది

అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 27 నెలల పాటు తీవ్రంగా శ్రమించి వ్యయ ప్రయాసలకోర్చి జీఎస్ఎంలుగా శిక్షణ పొందినా మళ్లీ గ్రామ సచివాయాలకే పరిమితం చేయడంపై ఏఎన్ఎంలలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. శిక్షణ పూర్తి చేసుకున్న రెండేళ్ల తరువాత జీఎస్ఎంగా పోస్టింగ్‌కు అవకాశం కల్పిస్తామని ఎంపిక సమయంలోనే అప్పటి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హామీ ఇచ్చారని చెబుతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు శిక్షణ పొందిన ఏఎస్ఎంలకు జీఎస్ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.11 లక్షల జరిమానా కట్టాలంట



"నా శిక్షణా కాలం పూర్తయింది. ఆరు నెలలు పొడిగించారు. నా కుమార్తె అనారోగ్యం కారణంగా పొడిగింపు కాలంలో ఒక నెల ముందు రిలీవ్ అయ్యాను. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. స్పందనలో అర్జీ పెడితే అధికారులు సానుకూలంగా స్పందించి న్యాయం చేశారు. నెల రోజుల ముందు రిలీవ్ అయిన విషయాన్ని రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాను. మూవ్‌మెంట్ ఆర్డర్‌ను సాకుగా చూపించి చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని కొందరు రూ.11 లక్షలు జరిమానా కట్టమంటున్నారు. నా కుమార్తె ఆస్పత్రిలో మంచంపై ఉంది. ఇలాంటి సమయంలో రూ.11 లక్షలు జరిమానా పేరుతో అడగడంతో దిక్కు తోచడం లేదు. జిల్లా అధికారులే నాకు న్యాయం చేయాలి. నా ఉద్యోగానికి భద్రత కల్పించాలి. – విజయలక్ష్మి, మదనపల్లి

మా వంకలో ఇసుక మీరెలా తోలుతారు?



నాగయ్యగారిపల్లి స్వర్ణముఖినదిలో జేసీబీ సాయంతో ఇసుకను తోడేస్తున్న ఇసుకాసురులు

చంద్రగిరి: ఓ వర్గం వారు ఇసుకను రవాణా చేస్తూ సొమ్ము చేసుకోవడంపై మరో వర్గానికి చెందిన వారు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య రగడ చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని నాగయ్యగారిపల్లిలోని స్వర్ణముఖి నదిలో టీడీపీ నాయకులు పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో నాగయ్యగారిపల్లికి చెందిన ఓ టీడీపీ వర్గం శనివారం తాము కూడా ఇసుకను తరలించేందుకు స్వర్ణముఖి నది వద్దకు చేరుకుంది. దీన్ని కూచువారిపల్లికి చెందిన మరో వర్గం నేతలు ఆక్షేపించారు. రెండు గ్రూపుల మధ్య మాటల యుద్ధం సాగింది. తమ గ్రామ వంకలో మీకేమి హక్కు ఉంది ఇసుకను తరలించేందుకు..? అంటూ నాగయ్యగారిపల్లికి చెందిన నేతలు ప్రశ్నించారు. దీంతో కూచువారిపల్లికి చెందిన వర్గం వారు 'మా ఇష్టం వచ్చిన చోట ఇసుకను తీసుకెళ్తాం..అడిగేందుకు మీరెవరు' అని అనడంతో రెండు గ్రూపుల మధ్య మాటల యుద్ధం పెరిగింది. రెండు వర్గాల వారు కొట్టుకునే స్థాయికి వెళ్లినట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు.

రెవెన్యూ కనుసన్నల్లోనే..?

టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాగయ్యగారిపల్లి స్వర్ణముఖినదిలో అధికార పార్టీ నేతలు ఇసుకను తరలిస్తూనే ఉన్నారు. అయితే ఇక్కడ పని చేస్తున్న వీఆర్ఓ ఇటీవల రిటైర్డు అయ్యారు. దీంతో గత ఎన్నికల్లో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఇక్కడ వీఆర్ఓగా పనిచేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. అధికారి పార్టీ నేతల ఇసుక దోపిడీకి అడ్డులేకుండా పోయింది. ఇసుక అక్రమ రవాణాపై స్థానికులు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూలోని అధికారులే పరోక్షంగా ఇసుక అక్రమ రవాణా చేసుకునేలా అధికార పార్టీ నాయకులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నామమాత్రపు దాడులు..

స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ రవాణాపై దినపత్రికల్లో వార్తలు ప్రచురితమైన సమయాల్లో రెవెన్యూ అధికారులు నామమాత్రంగా తనిఖీలను చేపడుతున్నారు. ఇటీవల నరసింగాపురం వద్ద మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. అయితే నాగయ్యగారిపల్లి వంక వైపు కన్నెత్తి చూడడం లేదు. అమాయకులమైన మాపై కక్షసాధింపులకు పాల్పడుతున్నారని ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల వాహనాలను వదిలేసి తమపై దాడులు చేయడం సమంజసం కాదని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

